# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

## THE WORD OF TRUTH



**MAY 1995**

# సంక్షిప్త వార్తలు

1995 ఏప్రియల్ 14, 15, 16 తేదీలలో విజయవాడ సత్యనారాయణపురం రైల్వే కమ్యూనిటి హాలులో క్రీస్తు సువార్త సమావేశములు జరిగెను. ఈ కూటములను గులాబి తోటలోని క్రీస్తు సంఘము ఘనంగా నిర్వహించిరి. ప్రతి రోజు రెండు కూటములు జరిగెను. అందులో సహో. విక్టర్ దానియేలు తురాకా, పి. ప్రకాశం మరియు M. జాన్ బాలసుందరంగారు వాక్యపరిచర్య చేయగా అనేకులు గొప్ప ఆత్మీయ మేలును పొందిరి. సహో. గొల్లపూడి సామ్యూల్‌గారు నిర్విరామ కృషి చేసి చక్కని ఏర్పాట్లు గావించి కూటములను జయప్రదముగా నిర్వహించిరి.

ఏప్రియల్ 20వ తేదీ గురువారం సాయంకాలము నుండి కాకినాడ స్కూల్ అఫ్ ప్రీచింగ్‌కు వేసవి సెలవులు ప్రకటించబడినవి. బైబిలు తర్బీదు పొందుచున్న 60 మంది విద్యార్థులు తమ తమ ప్రాంతములలో సువార్త ప్రకటించు ఆసక్తితో వారి గ్రామములకు తిరిగి వెళ్లిరి. స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ మరల జూన్ రెండో వారంలో తెరువబడును.

ఏప్రియల్ 21, 22, 23 తేదీలలో కృష్ణా జిల్లా ముదినేపల్లిలో అక్కడి క్రీస్తు సంఘము గొప్ప బహిరంగ సభలను నిర్వహించెను. RTC బస్ స్టాండు ఎదురుగా వేయబడిన పందిరిలో ఈ కూటములు నిర్వహించబడెను. సోదరులు నెహెమ్యా గూటం, పి. చంద్రశేఖర్, కె. సత్యనారాయణ, ఎ. ఆనంద్‌గార్లు పాలొని వాక్యపరిచర్య చేయగా 8 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. ముదినేపల్లిలోను, పరిసర గ్రామములలోను సోదరులు వై. లాజరుగారు గొప్ప పని చేయుచున్నారు.

[తరువాయి టైటిలు 3వ పేజీలో]

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH



P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone ; 0884-73722

Editor : J.C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM



Pleading for Restoration of First Century Christianity

సంపుటి 15 | మే 1995 | సంచిక 10


## సంపాదకీయం

### సాకులు చెప్పుట

### ( Offering Excuses )

మానవులు తమ క్రియలను సమర్థించుకొనే అలవాటు కలిగిన వారు. అబద్ధము, అక్రమము, మోసము, లంచగొండితనము, జారత్వము మొదలగు వేలకొలది అట్టి క్రియలు జరిగించువారు, "ప్రతి వారు ఆలాగు చేయుచున్నారుగదా ?" యని చెప్పుచు తమ అవినీతి క్రియలను సమర్థించుకొన ప్రయత్నిస్తారు. మిగతావారు అందరు అపరాధులే గనుక తాను వారిని అనుకరించడంలో పొరబాటు యేమీ లేదని ఒకడు తలంచ వచ్చును. నిజానికి అందరూ ఈ రకంగా జీవించుటలేదు. ఒకవేళ అందరు అట్లు జీవించుచుండినను, వారు చేయునవి నీతిక్రియ లెట్లవుతాయి? ఏదైనా ఒక సంగతి తప్పయితే అది తప్పే. దాన్ని ఎక్కువ మంది చేసినా, తక్కువ మంది చేసినా తప్పు

తప్పు. ఏదైనా ఒకటి రైటయితే, మిగతావారు చేయుచున్నా, లేక పోయినా, దాన్ని మనం తప్పక జరిగించాలి. మంచిని జరిగించు వారు కొద్దిమంది మాత్రమే యుండినను, మంచిని జరిగించినందువలన ఈలోక ప్రజలు సాధారణంగా మనలను గౌరవిస్తారు (రోమా 13:13; 1 థెస్స 4 : 12).

మంచిని జరిగించ లేకపోయినందున కొన్నిసార్లు మనం సాకులు చెప్పుతాం. సంఘారాధనలకు ప్రజలను ఆహ్వానించడంలో, మన సమయాన్ని వృథా చేస్తున్నామని చెప్పేవారుంటారు. మేము మా మిత్రులను, మిగతా వారిని ఆరాధనకు ఆహ్వానించాముగాని వారెవ్వడు రాలేదు, ఆసక్తిని చూపలేదని వారు చెబుతారు. అట్టివారు సువార్త ప్రకటించుటలో తమకున్న ఆసక్తిని కోల్పోయారు. సువార్త వినడానికి ప్రజలకు ఆసక్తి లేదని యితరులు పదేపదే చెప్పుట వారు విన్నారు, గనుక దానినేవారు కూడ చెప్పుటకు మొదలిడతారు. యిది సాతానుడు చేసే ప్రచారము. దేవుని ప్రజలు వాని ప్రచారానికి లోను కాకూడదు. మనము క్రీస్తునందు విశ్వాసులమైతే, ఆయన దేవుని కుమారుడని మనము విశ్వసించితే, ఆయన మనకొరకు చనిపోయాడనీ, మన రక్షకుడని మనము నమ్మితే, ఆవర్తమానాన్ని గొప్ప ఆసక్తితో యితరులకు బోధించెదము. మరియు క్రీస్తు కొరకు ఆత్మలను సంపాదించెదము, మన మిత్రులు ఆరాధనకు హాజరగునట్లు ప్రోత్సహించెదము. క్రీస్తు నొద్దకు వారిని నడిపించెదము.

క్రీస్తు సంఘము ద్వారా లభ్యమగు పుస్తకాలనుగూర్చి, కరపత్రములను గూర్చి, బైబిలు కరస్పాండెన్సు కోర్సును గూర్చి యితరులకు తెలియజేయని వారుంటారు. క్రీస్తుసంఘము సమర్పించుచున్న బైబిలు కరస్పాండెన్సు కోర్సు అని ప్రజలకు తెలిస్తే వారు ఆపారము

లను చదువరని కొందరు సాకులు చెబుతారు. సరిగదా కొన్ని ప్రదేశాలలో క్రీస్తు సంఘమును గూర్చి ఎరిగిన వారు చాల తక్కువే. క్రీస్తు సంఘమును గూర్చి ఎరిగినవారు కొద్దిమందియే అయితే దాన్ని గూర్చి వారు దురభిమాన ద్వేషమును ఎట్లు కలిగియుంటారు? సంఘమును గూర్చిన సరియైన అవగాహన వారు కలిగియుండక పోవుటలో అసలు పొరబాటు మనదే అయ్యుండవచ్చును.

అయితే నేడో రేపో వారు సంఘమును గూర్చి తెలిసికొనాలి. వారికి మనం సత్యము బోధించాలి. ఒకడు సత్యమును గూర్చి దురభిమాన ద్వేషం కలిగియుంటే, నీవు అట్టివానికి క్రీస్తుసంఘమునుగూర్చి బోధించుటకు వెనుకాడితే, సంఘము యొక్క విశిష్టతను అతడు ఎన్నడు కనుగొనలేడు. ప్రభువును గూర్చి ఆయన సంఘమునుగూర్చి నీవు సిగ్గుపడవలసిన పనియేమున్నది?

పరలోకమునకు పోవు మార్గము యేసు ఒక్కడేయని మనం గుర్తుంచుకోవాలి. ఆయన మార్గము సంకుచితమైనది (యోహాను 14:6; మత్త 7:18,14). ఇతరులు చేసినా చేయకపోయినా, ప్రభువు ఏమికోరుచున్నాడో దానిని మనం తప్పక చేయాలి. సరిగదా మనం ప్రభువునందు నిజముగా విశ్వసించినవారమైతే, అన్నిటిలోను ప్రాధాన్యత ఆయనకు యిస్తే, యితరులకు క్రీస్తును గూర్చి బోధించే తరుణములను అనేకములను మనం కనుగొంటాము. ఆయన పని చేయకుండా సాకులు చెప్పుట అప్పుడు మనవల్ల కాదు. మనం ప్రభువును ప్రేమించి, ఆయనను గూర్చి ఈలోకానికి చాటి, నమ్మకముగా ఆయనకు పరిచర్య చేస్తు ఆయన మహిమార్థమై ఫలములు ఫలింతుము. సాకులు చెప్పకుండునట్లు దేవుడు మనకు సహాయం చేయును గాక!

— o —

# దేవుని ఆలయము

## ( God's Temple )

"మీరు దేవుని ఆలయమై యున్నారనియు, దేవుని ఆత్మ మీలో నివసించు చున్నాడనియు మీరెరుగరా ? ఎవడైనను దేవుని ఆలయమును పాడు చేసిన యెడల దేవుడు వానిని పాడుచేయును. దేవుని ఆలయము పరిశుద్ధమైనది; మీరు ఆ ఆలయమై యున్నారు" (1 కొరింథీ 3:16,17).

సర్వశక్తుడైన దేవుడు మానవునితో సహవాసము కోరుచున్నాడని నిజముగా మనము నమ్మగలమా? అట్టిది ఆయన కోరిక కాకపోతే ఈ విశ్వాన్ని, ఆకాశమును, భూమిని, మానవులను యెహోవా దేవుడు ఎందుకు సృజించినట్లు ? సర్వ జ్ఞానియైన దేవుడు సమస్తాన్ని చేసి మానవుని ఒక ఆటబొమ్మలాగ ఎందుకు చేస్తాడు ? ఈలోకము, మానవుడు, నిర్మించబడిన విధానాన్ని బట్టి చూస్తే పరలోకమందున్న దేవుడు మానవులతో సహవాసాన్ని కోరుచు దానిలో ఆనందించు చున్నాడని నిర్ధారణ యగుచున్నది. దీనినే లేఖనములు బోధించు చున్నవి. దేవుడు తన ప్రజలతో ఇట్లన్నాడు : "నేను వారిలో నివసించి సంచరింతును, నేను వారి దేవుడనై యుందును. వారు నా ప్రజలై యుందురు" (2 కొరింథీ 6 : 16).

దేవుడు తన ప్రజల మధ్య నివసించునను ఈ వాస్తవాన్ని సంఘముతో సమన్వయించి చూడాలి. క్రొత్తనిబంధన ప్రకారము సంఘము దేవుని ఆలయమైయున్నది. అదొక ఆత్మీయ మందిరం (1 పేతురు 2 : 5). ప్రతి క్రైస్తవుడు దానిలో ఒక సజీవమైన రాయి యైయున్నాడు. మరియు ఈ ఆలయమంతయు దేవుని ఆత్మీయ గృహమై యున్నది (ఎఫెసీ 2 : 21, 22). సంఘమే దేవుని ఆలయమనేది సత్యము గనుక క్రీస్తు సంఘమును మరింత అర్థము చేసుకొనులాగున, "సంఘము దేవుని ఆలయ మెట్లయినది?" యని అడుగుదాం.

# 5

## సమావేశ స్థలము

దేవుడు మానవుడు సమావేశమయ్యే స్థలము సంఘము గనుక అది దేవుని ఆలయమై యున్నది. దేవుడు మానవుడు సహవాసములో ఏకమయ్యే స్థలము సంఘము. ఇశ్రాయేలీయులు సీనాయి కొండ దగ్గరకు వచ్చినప్పుడు, దేవుడు మోషే ద్వారా వారికి తన ధర్మ శాస్త్రాన్ని, ఆరాధన స్థలాన్ని అనుగ్రహించాడు. ఈ యారాధన స్థలము "సాక్ష్యపు గుడారమని పిలువబడింది. ఏలయనగా యెహోవా దేవుడు అక్కడ యాజకులను, మోషేను, ఇశ్రాయేలీయులను కలసి కొనేవాడు" (నిర్గమ 29:42,43). సాక్ష్యపు గుడారము ద్వారము నొద్ద దహనబలులు నిత్యము అర్పించబడుచు యుండేవి. "నేను నీతో మాట లాడుటకు అక్కడికి వచ్చి మిమ్మును కలసికొందును. అక్కడికి వచ్చి ఇశ్రాయేలీయులను కలసికొందును; అది నా మహిమవలన పరిశుద్ధ పరచబడును" అని ఆయన చెప్పెను (నిర్గమ 29 : 42, 43). దేవుడు, ఆయన ప్రజలు కలసికొని సహవసించే స్థలాన్ని దేవుడే ఏర్పరచాడు.

క్రీస్తు యొక్క క్రొత్తనిబంధన ప్రకారము దేవుడు, ఆయన ప్రజలు కలసికొనుటకుగాను దేవుడు సంఘమును ఏర్పరచాడు. మనము క్రీస్తు సువార్తకు విధేయులమైనప్పుడు, యేసు రక్తములో మన పాపములు కడుగబడును. మరియు దత్తత ద్వారా దేవుని కుటుం బములోనికి చేర్చబడియున్నాము (ఎఫెసీ 1:5; గలతీ 4:6). క్రైస్తవు లైనవారు దేవుని తెలిసికొనుటయేగాక, దేవుని చేత ఎరుగబడిన వారును ఆయన స్వాస్థ్యములోనికి తేబడినవారును అగుదురు (ఎఫెసీ 1:14; గలతీ 4 : 9). మనము దేవుని కుమారులమగుదుము, మరియు కుమారులవలె క్రీస్తు ద్వారా నిత్యజీవ వారసుల మగుదుము (రోమా 8: 17; గలతీ 4 : 7). దేవుని కుటుంబమైన సంఘములో మనము

ప్రవేశింతుము. అక్కడ దేవునితో స్నేహ సహవాసములతో కలిసి నడుచుకొందుము.

కొన్ని సంవత్సరముల క్రితము మార్షల్ కీబుల్ అనే మంచి బోధకుడు అమెరికాలో యుండేవాడు. ఆయన వలన సంఘము బహుగా ఆశీర్వదించబడింది. మరియు బైబిలు సత్యములను ఆయన చక్కగా వర్ణించి చెప్పేవాడు. ఒక రాత్రి కూటములో బాప్తిస్మమును గూర్చి ప్రసంగించుచు ఆయన 1 పేతురు 3 : 21 ని ఎత్తి చూపించాడు: "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది; అదేదనగా శరీర మాలిన్యము తీసివేయుట కాదుగాని, యేసుక్రీస్తు పునరుత్థానమూలముగా దేవుని విషయము నిర్మలమైన మనసాక్షి నిచ్చు ప్రత్యుత్తరమే". బాప్తిస్మము దగ్గర ముగ్గురు హాజరై యుందురని సహోదరుడు కీబుల్ గారు చెప్పారు. "బాప్తిస్మము పొందే పాపి, అతనికి బాప్తిస్మ మిచ్చే సహోదరుడు, మరియు దేవుడు అక్కడ ఉందురు! బోధకుడు పాపికి బాప్తిస్మ మిచ్చునప్పుడు దేవుడు, పాపికూడ నీటిలో కలసికొందురు" అని Bro. కీబుల్ గారు చెప్పేవారు.

కీబుల్ గారి ఉదాహరణ ఒక గొప్ప సత్యాన్ని బయలుపరచుచున్నది. రక్షణ సంకల్పములో భాగముగా దేవుడు బాప్తిస్మమునాజ్ఞాపించాడు. మనము క్రీస్తులోనికి రాకముందు ఆయనకు లోబడే చివరి ఆజ్ఞ యిది. విశ్వసించి మారుమనస్సు పొందిన పాపులు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినప్పుడు, వారు దేవునితోను క్రీస్తుతోను ఏకమవుదురు (రోమా 6:3; గలతీ 4:6).

సువార్తలోని విశేష వర్తమానము యేమంటే, దేవుడు మానవునితో పరిశుద్ధ సహవాసములో కలసికొనే స్థలాన్ని, సంఘాన్ని ఆయన ఏర్పరచాడు. సంగ్రహముగా దేవుడు ఈ క్రైస్తవ యుగంలో,

తన గ్రంథములో మానవునితో "నేను నిన్ను నా ఆలయమును, క్రీస్తు శరీరమైన సంఘములో కలిసికొందును. నీవు నాతో ఏకమై ఆత్మీయ జీవమును, సహవాసమును కలిగియుండు నిమిత్తము నీకొరకు రక్షణమార్గము నేర్పరిచాను" అని చెప్పుచున్నాడు.

## నివాస స్థలము

సంఘము దేవుని నివాస స్థలము గనుక అది దేవుని ఆలయమై యున్నది. దేవుడు తన ఆలయములో మనతో సమావేశ మగుటయే గాక, దానిలో ఆయన మనతో నివసించును. సంఘము ద్వారా దేవుడు తన ప్రజలమధ్య నివసించును.

మోషే ధర్మశాస్త్రము ప్రకారము ప్రత్యక్ష గుడారమును గూర్చి దేవుడు ఇశ్రాయేలీయులతో ఇట్లు చెప్పాడు: "నేను ఇశ్రాయేలీయుల మధ్య నివసించి వారికి దేవుడనై యుందును. కాపున నేను వారి మధ్య నివసించునట్లు ఐగుప్తు దేశములోనుండి వారిని వెలుపలికి రప్పించిన తమ దేవుడైన యెహోవాను నేనే యని వారు తెలిసికొందురు. నేను వారి దేవుడనైన యెహోవాను" (నిర్గమ 29:45, 46). ప్రత్యక్ష గుడారము దానికి సంబంధించిన సంగతులన్నియు వారిమధ్య గల దేవుని ఉనికిని ఇశ్రాయేలీయులకు ప్రత్యక్షపరుస్తు యుండేవి. యెహోవా తేజస్సు మందిరమును నింపెను (నిర్గమ 40 : 34). ఇశ్రాయేలీయుల కన్నుల ఎదుట పగటివేళ యెహోవా మేఘము మందిరము మీద ఉండెను. రాత్రివేళ అగ్ని దానిమీద ఉండెను. ఇశ్రాయేలీయులు ప్రయాణము చేయుచుండగా దేవుని నడిపింపునకు సూచనగా ఆ మేఘము వారిముందు నడిచెను. అగ్ని స్తంభము రాత్రివేళ వారికి దేవుని నడిపింపు ననుగ్రహించెను (నిర్గమ 40 : 36-38; సంఖ్యా 9:15-23). ప్రత్యక్ష గుడారము ద్వారా దేవుడు తన ప్రజలమధ్య నివసించుచు, నడిపించుచు యుండెను.

క్రొత్తనిబంధనలో, దేవుడు ఆత్మ ద్వారా నివసించు స్థలము సంఘము; పౌలు కొరింధులోని సంఘమున కిట్లు వ్రాసాడు: "దేవుని ఆలయమునకు విగ్రహములతో యేమి పొందిక? మనము జీవముగల దేవుని ఆలయమై యున్నాము; అందుకు దేవుడీలాగు సెలవిచ్చుచున్నాడు: నేను వారిలో నివసించి సంచరింతును, నేను వారి దేవుడనై యుందును. వారు నా ప్రజలై యుందురు" (2 కొరింధీ 6:18). క్రైస్తవులైన అన్యజనులను గూర్చి పౌలు ఈలాగు చెప్పాడు: "కాబట్టి మీరిక మీదట పరజనులును పరదేశులునై యుండక పరిశుద్ధులతో ఏక పట్టణస్థులును, దేవుని యింటివారునై యున్నారు. క్రీస్తు యేసే ముఖ్యమైన మూలరాయియై యుండగా అపొస్తలులును ప్రవక్తలును వేసిన పునాది మీద మీరు కట్టబడియున్నారు. ప్రతి కట్టడమును ఆయనలో చక్కగా అమర్చబడి ప్రభువునందు పరిశుద్ధమైన దేవాలయ మగుటకు వృద్ధిపొందుచున్నది. ఆయనలో మీరు కూడ ఆత్మ మూలముగా దేవునికి నివాసస్థలమై యుండుటకు కట్టబడుచున్నారు" (ఎఫెసీ 2:19-22).

క్రైస్తవులలో దేవుడు రెండు విధములుగ నివసించును: క్రైస్తవుని హృదయమును ఆయన ఆలయముగ నెంచుచు ఆయన ఆత్మ ప్రతి క్రైస్తవునిలోను నివసించును. అందువలన ప్రతి క్రైస్తవుడు జారత్వమునుండి తొలగి తన దేహమును పవిత్రముగ నుంచవలెనని పౌలు బోధించాడు. "జారత్వమునకు దూరముగ పారిపోవుడి ... మీ దేహము దేవుని వలన మీకు అనుగ్రహింపబడి మీలోనున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీరెరుగరా?" (1 కొరింధీ 6:18, 19).

రెండవదిగా దేవుని ఆత్మ క్రైస్తవుల సమాజములో, సంఘములో నివసించును. కొరింధులోని సంఘమును గూర్చి పౌలు ఇట్లు

వ్రాసాడు : "మీరు దేవుని ఆలయమై యున్నారనియు దేవుని ఆత్మ మీలో నివసించుచున్నాడనియు మీ రెరుగరా?" (1 కొరింథీ 3:16). దేవుడు తన ప్రజల మధ్య ఎట్లు నివసించునో యను ప్రశ్నను మనందరము ఎదుర్కొందుము. అయితే ఆయన తన వాక్యముద్వారా నివసించును, ఏలయనగా ఆయన తన వాక్యముద్వారా పనిచేయునని మన మెరుగుదుము (ఎఫెసీ 6 : 17).

హోరేబులో మండుచున్న పొద దగ్గర మోషే తన 80వ ఏట దేవుని కలసికొన్నాడు (నిర్గమ 3 : 1). "కాగా రమ్ము, నిన్ను ఫరో యొద్దకు పంపెదను; ఇశ్రాయేలీయులైన నా ప్రజలను నీవు ఐగుప్తులో నుండి తోడుకొని పోవలెనని" దేవుడతనితో అనెను (నిర్గ 3 : 10). దేవుని పక్షముగా ఐగుపుకు వెళ్ళవలసినవాడు తానే యని మోషే నమ్మలేదు, అయితే అతని సాకులకు దేవుడు జవాబిచ్చిన తరువాత, ఇశ్రాయేలీయులను విడిపించుటకు మోషే కంకణము కట్టుకొని మరీ వెళ్ళాడు. దేవునితో కలసికొనుటలోను, దేవునితో కలసి నడచుటలోను గల భేదమును మోషే వెనువెంటనే తెలిసికొన్నాడు. హోరేబులో అతడు దేవుని కలసికొన్నాడు. అక్కడ అతనికొక గొప్ప పని అప్పగించబడినది. హోరేబును విడిచినప్పుడతడు దేవునితో నడుస్తు వెళ్ళాడు: "నిశ్చయముగా నేను నీకు తోడై యుందును" అని దేవుడతనికి చెప్పాడు (నిర్గమ 3 : 12). దేవుడు తన వాగ్దానమును నెరవేర్చాడు. మోషే ఇశ్రాయేలీయులను నడిపించుచు వచ్చినప్పుడు పది తెగుళ్లనుండి, ఎర్రసముద్రములోనుండి, సీనాయి వరకు దేవుడతనితో నడిచాడు.

దేవుని ఆలయమైన సంఘముగా, మనము క్రీస్తులో దేవుని కలసికొనుటయేగాక, దేవుడు మనలో నివసిస్తు, మరియు మనతో చలిస్తు యున్నాడు. మనము క్రైస్తవ జీవితమును నమ్మకముగా జీవిస్తు

యుండగా, మనము దేవునితో దినదిన సహవాసము కలిగియుందుము. ఆయన సహవాసము లేకుండా మనము ఏవిధమైన శోధనను, కష్టమును ఎదుర్కొనము. యోహాను ఇట్లు వ్రాసాడు: "ఆయనతో కూడ సహవాసము గలవారమని చెప్పుకొని చీకటిలో నడిచిన యెడల మన మబద్ధమాడుచు సత్యమును జరిగింపకుందుము. అయితే ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడిచిన యెడల, మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము. అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:6, 7).

## ఆరాధన స్థలము

మూడవదిగా, దేవుని ఆలయమైన సంఘము ఒక ఆరాధన స్థలము. క్రైస్తవుడు చలించు ఆలయమై యున్నాడు. పేతురిట్లు చెప్పాడు: "యేసుక్రీస్తు ద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మ సంబంధమైన బలుల నర్పించుటకు పరిశుద్ధ యాజకులుగా ఉండునట్లు, మీరును సజీవమైన రాళ్ళవలె నుండి ఆత్మ సంబంధమైన మందిరముగా కట్టబడుచున్నారు" (1 పేతురు 2:5). "అయితే మీరు చీకటిలోనుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి మిమ్మును పిలిపించినవాని గుణాతిశయములను ప్రచురము చేయు నిమిత్తము ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజక సమూహమును, పరిశుద్ధ జనమును, దేవుని సొత్తయిన ప్రజలునై యున్నారు". దేవుని యాజకులవలె క్రైస్తవులు క్రీస్తు ద్వారా దేవునికి ఏ కాలమందైనను, ఏ స్థలమందైన స్తోత్రములు చెల్లింపవచ్చును. "గనుక మనము కనికరింపబడి సమయోచితమైన సహాయము కొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనము నొద్దకు చేరుదము" (హెబ్రీ 4 : 16).

యాకోబు బావిదగ్గర సమరయ స్త్రీతో మాట్లాడుచు యేసు,

"అమ్మా, ఒక కాలము వచ్చుచున్నది; ఆకాలమందు ఈ పర్వతము మీదనైనను యెరూషలేములోనైనను మీరు తండ్రిని ఆరాధింపరు". "అయితే యదార్థముగా ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను తండ్రిని ఆరాధించు కాలము వచ్చుచున్నది; అది ఇప్పుడును వచ్చే యున్నది. తన్ను ఆరాధించువారు అట్టివారే కావలెనని తండ్రి కోరుచున్నాడని" చెప్పెను (యోహాను 4 : 21, 23). క్రైస్తవులు దేవుని యాజకులుగా క్రీస్తుద్వారా సమయము, స్థలము నిమిత్తము లేకుండా ఆరాధించు క్రైస్తవ యుగాన్ని గూర్చి యేసు ఆమెతో చెప్పెను.

దేవుని దగ్గరకు వెళ్లుటకు సంపూర్ణ స్వేచ్ఛ కలిగినవారై క్రైస్తవులు ఆరాధించు తరుణమును, విమోచన మార్గమును (1 యోహాను 2 : 1), దేవుని శక్తిని కలిగి యున్నారు (ఎఫెసీ 1 : 19). దేవుని యాజకులుగా మనము సమృద్ధిగా దీవించబడినవారము. కాబట్టి ఆయన ద్వారా మనము దేవునికి ఎల్లప్పుడును స్తుతియాగము చేయుదము; అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు జిహ్వాఫలము అర్పించుదము" (హెబ్రీ 13:15).

## ముగింపు

సంఘము దేవుని ఆలయమై యున్నది! ఎంతగొప్ప సత్యమో! దేవుని ఆలయముగా సంఘము దేవుని సమావేశ స్థలము, దేవుని నివాస స్థలము, మరియు మన ఆరాధన స్థలమై యున్నది. నీవు క్రీస్తు సంఘ సభ్యుడవా? నీవు క్రీస్తుకు వెలుపల యున్నట్లయితే నీవు ఏమేమి పోగొట్టుకొనుచున్నావో ఆలోచించుకొనుము. క్రీస్తు సంఘములోనికి వచ్చు వాడెవడైనను దేవుని నిత్యసంకల్పములోనికిని, ఆయన శరీరము లోనికిని వచ్చును. అట్టి వారితో "నేను మిమ్మును చేర్చుకొందును, మీకు తండ్రినై యుందును, మీరు నాకు కుమారులును కుమార్తెలునై

యుందురని సర్వశక్తిగల ప్రభువు చెప్పుచున్నాడు" (2 కొరింథి 6:18). ఒకడు క్రైస్తవుడైనప్పుడు మంటిఘటమైన అతని దేహము దేవుని మహిమగల మందిరమగును!! —ఎడ్డీక్లోర్ (TFT)

— ० —

## నీవు ఏ సంఘమునకు చెందినవాడవు ?

## ( To Which Mission Do You Belong ? )

(మత్తయి 15 : 13)

1960వ సంవత్సర ప్రాంతములో నా కుటుంబము మరియు మరియొక సహ మిషనరీ కుటుంబము జర్మనీ నుండి పాకిస్తాన్‌కు భూ మార్గమున ప్రయాణము చేయుచుంటిమి. లెబానోను సరిహద్దులు దాటుచుండగా ఒక ఆసక్తికరమైన అనుభవమును ఎదుర్కొంటిమి. సాధారణ క్రమముచొప్పున మా పాస్‌పోర్ట్సు తనిఖీ చేయుచుండగా మా ఉద్యోగములు ఏమని ప్రశ్నించిరి. మేము క్రీస్తు సువార్త బోధ కులమని సమాధాన మిచ్చితిమి. అప్పుడు ఆ అధికారులు మీరు ఏ సంఘమునకు చెందినవారు కేథోలిక్కులా ? లేక ప్రొటెస్టాంటులా ? అని అడిగిరి. మేము ఏ మతశాఖకు చెందినవారము కాము. మేము క్రైస్తవులము మాత్రమే అని సమాధానమిచ్చి నప్పుడు వారు ఈ మానవ లోకములోని మతసంబంధమైన ఆలోచనలతో, వారు పొందిన తర్ఫీదుతో చాలా పెద్ద వాదము మొదలుపెట్టిరి. కేథోలిక్ క్రైస్తవుడుగా లేదా ప్రొటెస్టాంట్ క్రైస్తవుడుగా గాకుండా ఒక సాధారణ క్రైస్తవునిగా యుండుట అసాధ్యముగా తోచుచున్నదని వారనిరి.

ఆసియాలో పనిచేయుచున్న 32 సంllనుండి నీవు ఏ సంఘము నకు చెందినవాడవు? అను ప్రశ్న చాలాచోట్ల మరల మరల అడగబడి యున్నది. ఈ ప్రశ్న యొక్క భావమును గూర్చిన కొన్ని విషయము లను గమనింతము.

ఈ విధమైన ఆలోచన ఎక్కడనుండి ఉత్పత్తి అయినది? వేరు వేరు ప్రత్యేకమైన సంఘములు అనే ఆలోచన దేవునినుండి ఉత్పన్నమైనది కాదు. అపొస్తలుడైన పౌలు ఎఫెసు పట్టణములోని క్రైస్తవులకు వ్రాస్తూ ఈ విషయమును స్పష్టముగా సూచించెను. "శరీర మొక్కటే, ఆత్మయు ఒక్కడే, ఆ ప్రకారమే మీ పిలుపు విషయమైన యొక్కటే నిరీక్షణయందుండుటకు పిలువబడిరి" (ఎఫెసీ 4:4). ఎఫెసులోయున్న సంఘపు పెద్దలవద్ద సెలవు తీసికొని వెళ్ళునప్పుడు పౌలు వారిని ఈ విధముగా హెచ్చరించెను. "దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన తన సంఘమును కాయుటకు పరిశుద్ధాత్మ మిమ్మును దేనియందు అధ్యక్షులుగా ఉంచెనో ఆ యావత్తు మందను గూర్చియు, మీ మట్టుకు మిమ్మును గూర్చియు జాగ్రత్తగాయుండుడి. నేను వెళ్ళిపోయిన తరువాత క్రూరమైన తోడేళ్ళు మీలో ప్రవేశించునని నాకు తెలియును. వారు మందను కనికరింపరు" (అపొ. కా. 20:28-29). పౌలు చేసిన ఆ హెచ్చరిక క్రీ. శ. 300 ప్రాంతములో నిజమయ్యెను. దేవుని వాక్యమును విడిచి పెట్టుట వలన, మరియు మానవులయొక్క ఉద్దేశములు మరియు సాంప్రదాయములను ఉన్నత స్థితి యందుంచుట వలన ఈ విధమైన స్వంత బోధ ప్రారంభమయ్యెను.

16వ శతాబ్దములో కొంతమంది మతనాయకులు రోమన్ కేథోలిక్ సంస్థలయొక్క అణచివేత మరియు క్రూరత్వమునకు విసిగి వారిపై తిరుగుబాటు చేసిరి. అప్పటి నుండి ఈ రోజు మనకు తెలిసిన ప్రొటెస్టెంట్ మతశాఖలు లేక వేరు వేరు సంఘములు ఏర్పడినవి.

క్రీస్తు మతమును అనుసరించు సమస్త దేశములలో ఒక వ్యక్తి తప్పనిసరిగా కేథోలిక్ గాని ప్రొటెస్టెంట్ గాని అయివుండవలెనను ఒక సాధారణమైన మార్గపు భావన కలదు. కాని అటువంటి భావన లేదని బైబిలు మాట్లాడుచున్నది.

మనుష్యులు మతశాఖల సిద్ధాంతములను వి త్తనములను వి త్తిరి. యోగ్యమైన పురుషులు మరియు స్త్రీలు ఆయా సంఘ సిద్ధాంతములను పరిశీలించవలెను. దేవుడు లేక మానవుడు సంఘముయొక్క బోధలను స్థాపించెనా? కొన్ని మతశాఖలవారు శిశువులు ఆదాముయొక్క పాపమును వంశ పారంపర్యముగా పొందియున్నారు కనుక వారు తప్పనిసరిగా బాప్తిస్మము పొందవలెనని బోధింతురు. ఇది దేవునియొక్క బోధయై యున్నదా? అట్లయిన దానిని గూర్చి బైబిలులో మనము చదువగలము. ఒకవేళ నీవు పరిశీలించిన అట్టి సిద్ధాంతము దేవుని వాక్యమునందు లేదు కావున అట్టి సిద్ధాంతము కొట్టివేయబడవలెను. బైబిలు స్పష్టముగా బోధించుచున్నదేమనగా పాపము వంశ పారంపర్యముగా వచ్చునది కాదు(యెహెజ్కేలు 18:20). క్రొత్త నిబంధన ఈ విధముగా తెలియజేయుచున్నది. ప్రతి ఒక్కరు బాప్తిస్మము పొందుటకు ముందు సువార్తను విని దానిని విశ్వసించవలెను (మార్కు 16:15, 16). ఒక శిశువుకు సువార్తను వినుట, విశ్వసించుట, బాప్తిస్మము పొందుట అను అవసరతలను ఎదుర్కొను సామర్ధ్యము లేదు.

చాలామంది రక్షణ పొందుటకు బాప్తిస్మము అవుసరము లేదని బోధింతురు. దేవుడు మరియు ఆయన కుమారుడు ఇది అవుసరమని నిర్ధారించెను (మార్కు 16:15, 16; అపొ.కా.2:38). ఈ వచనములను జాగ్రత్తగా చదివిన మనకు తెలియును. అపొస్తలుడైన పేతురు ఆత్మావేశముతో ఈలాగు వ్రాసెను: "బాప్తిస్మము మిమ్మును రక్షించును" (1 పేతురు 3:21).

నీవు ఏ సంఘమునకు చెందినవాడవో ఆ సంఘములో ప్రతి ఆదివారమున ఆరాధనకు కూడునప్పుడు ప్రభురాత్రి భోజనమును ఒక ఆజ్ఞగా పాటింతురా? లేక పీరైతే నెలకు ఒకటి లేక రెండు సార్లు, లేక సంవత్సరమునకు ఒకటి రెండు సార్లు పాటింతురా? క్రీస్తుయొక్క

శిష్యులు తప్పనిసరిగా వారములో మొదటి దినమున ప్రభువు భోజనమును జ్ఞాపకార్థముగా పుచ్చుకొనిరని బైబిలు తేటగా ఉదహరించుచున్నది. ఈ విధముగా పాల్గొనుట ప్రతీ ఆదివారము ఆరాధనలో అవసరము (అ. కా. 20:7).

## ము గిం పు

నీవు ఏ మతశాఖకు చెందినవాడవు? నేను ఏ మతశాఖకు చెందను. ఏ మతమైతే మానవుల ఆత్మలను రక్షించునో ఆ ప్రభువైన యేసు క్రీస్తు సంఘమునకు చెందినవాడను. యేసు ఈ విధముగా చెప్పుచున్నాడు: "మీరు నా వాక్యమందు నిలచినవారైతే నిజముగా నాకు శిష్యులై యుండి సత్యమును గ్రహించెదరు. అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును" (యోహాను 8:31, 32).

—గోర్డన్ హోగన్, సింగపూర్.

—o—

## మానవ జ్ఞానమునకు విరుద్ధమైన దేవుని జ్ఞానము

## (The Wisdom of Men vs The Wisdom of God)

అపొస్తలుడైన పౌలు కొరింథీయులకు ప్రకటిస్తూ ఈ లోక జ్ఞానము దేవునికి వెర్రితనముగా యున్నదని చెప్పెను. యెషయా ప్రవక్తకూడా "దేవుని తలంపులు మానవ తలంపులవంటివి కావు, ఆయన త్రోవలు మనుష్యుల త్రోవలవంటివి కావు" అని ప్రకటించెను. మరియు యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు: "ఆకాశములు భూమికి పైన ఎంత ఎత్తుగా ఉన్నవో మీ మార్గములకంటె నా మార్గములు మీ తలంపులకంటె నా తలంపులు అంత ఎత్తుగా ఉన్నవి" (యెష 55:8, 9).

దేవునియొక్క తలంపులు మరియు మార్గములు నిర్దోషమైనవి

కాగా మానవునియొక్క తలంపులు మరియు మార్గములు బలహీనతల తోను, పొరపాట్లతోను నిండియున్నవి. పౌలు తీతుకు తెలియజేస్తూ దేవుడు అబద్ధమాడనేరడు అని అంటున్నాడు (తీతు 1:2) "మానవుల జ్ఞానము దేవుని జ్ఞానముతో వ్యాజ్యమాడినప్పుడు ప్రతి మనుష్యుడు అబద్ధికుడగును కాని దేవుడు సత్యవంతుడు కాకమానడు" (రోమా 3 : 4).

## మానవుని వెర్రితనము

1 కొరింథి 1 : 18; 2 : 5 మరియు క్రొత్త నిబంధన అంతయు పౌలు గుర్తించిన విధముగా క్రీస్తు యేసు నందలి దేవుని ప్రత్యక్షతకు దూరముగా మానవుడు తన ఆత్మను నడిపించుటకు చేయు ప్రయత్నము లన్నియు వెర్రితనముగా యున్నవని బయలు పరచుచున్నది. అందుచేత అపొస్తలుడైన పౌలు ప్రకటించిన దేమనగా "సిలువను గూర్చిన వార్త నశించుచున్న వారికి వెర్రితనముగాని రక్షింపబడు చున్న మనకు దేవుని శక్తి" (1 కొరింథి 1 : 18). లోకములోని తత్వవేత్తలు దేవుని జ్ఞానమును ప్రక్కకు యుంచుటకు చేయు ప్రయత్నము లన్నింటిలో విజయమును సాధించరు. చరిత్ర గమనములో తత్వజ్ఞాన వివరణ అనునది మానవ మార్గమున క్షణ మాత్రము వెలుగు నిచ్చునదిగాను మరియొక వెలుగు దాని నాక్రమించినపుడు రెపరెప లాడి ఆరిపోవు దీపమువలెను ఉండును.

మానవులు అనగా క్రైస్తవులుకూడా కొన్ని సార్లు తమ స్వంత జ్ఞానముచే పట్టబడునపుడు పౌలు చెప్పిన మాటలు జ్ఞాపకమునకు వచ్చును. అదేమనగా వారు దుఃఖపూరిత పరిస్థితులపై ధ్యానముంచుదురు. "ఓ అవివేకులైన గలతీయులారా! మిమ్మును ఎవడు భ్రమ పెట్టెను? సిలువ వేయబడినవాడైనట్టుగా యేసుక్రీస్తు మీ కన్నుల యెదుట ప్రదర్శింపబడెనుకదా? ఇది మాత్రమే మీ వలన

తెలిసికొన గోరుచున్నాను. ధర్మశాస్త్ర సంబంధ క్రియల వలన ఆత్మను పొందితిరా ? లేక విశ్వాసముతో వినుటవలన పొందితిరా ? మీరింత అవివేకులైతిరా ? మొదట ఆత్మానుసారముగా ఆరంభించి యిప్పుడు శరీరానుసారముగా పరిపూర్ణులగుదురా ? (గలతీ 3:1-3).

యేసు సజీవుడు కాకపోయినట్లయితే ఆయన స్వభావమును గూర్చి ఎవ్వరును తర్కించరు గదా ? అపొస్తలుల బోధకు యేసు సమాధి పునరుత్థానము శక్తి నివ్వక పోయినట్లయిన, ఏ ఒక్కరు దానిని తిరిగి నిర్వచించుటకు ప్రయత్నించరు గదా ? సంఘము అభివద్ధి చెందక పోయినట్లయితే, దానిని మరచిన సంగతులను గూర్చిన ప్రతులను ఉంచు స్థానముగా దానిని భావింతురు కదా ? క్రొత్త నిబంధన వ్రాయబడక పోయినట్లయితే ఏ ఒక్కరు దానిని పురాణ సంబంధమైనదని సార్థకము చేయుటకు ప్రయత్నించరు గదా ? పరలోకము మొదటి క్రైస్తవులకు నిరీక్షణ కాకపోయినట్లయితే, అవివేకులును, జ్ఞానములేనివారి నిరీక్షణవలె ఏ ఒక్కరును నిత్యజీవమును గూర్చి మాట్లాడరు కదా ? నిజముగా క్రైస్తవ విశ్వాసముయొక్క గొప్ప సిద్ధాంతము లన్నియు అగ్రిగామిగా ఉండి అన్ని ప్రయత్నములను అప్రతిష్టపాలు చేయుచున్నట్లు స్పష్టమగుచున్నది.

ఒక ఉత్తమమైన ప్రశ్న అడగబడుచున్నది : ఎందుచేత మనుష్యులు యేసుక్రీస్తును మరియు ఆయన పనిని వ్యతిరేకించుచున్నారు ? ఆయన ఈ లోకములోనికి ఏమి సాధించుటకు వచ్చెను? యేసుక్రీస్తు తానే తప్ప మరెవ్వరును ఈ ప్రశ్నకు సరియైన జవాబును ఇవ్వజాలరు. "ఆ తీర్పు ఇదే. వెలుగు లోకములోనికి వచ్చెను గాని తమ క్రియలు చెడ్డవై నందున మనుష్యులు వెలుగును ప్రేమింపక చీకటినే ప్రేమించిరి. దుష్కార్యము చేయు ప్రతివాడు వెలుగును ద్వేషించును. తన క్రియలు దుష్క్రియలుగా కనబడకుండునట్లు వెలుగునొద్దకు రాడు"

(యోహాను 3:19, 20). యేసుక్రీస్తు సిలువ మాత్రమే మానవ జ్ఞానమునకు దేవుని జ్ఞానమునకు మధ్య జరుగు పోరాటమునకు జ్ఞాపకార్థముగా యున్నది.

మానవ జ్ఞానమునకు అనుకూలముగా దేవుని జ్ఞానమును విడిచిపెట్టుటకు ఏదైనా కారణమున్నదా ? మారుతున్న కాలమునకు అనుగుణముగా పాత సాంప్రదాయములు క్రొత్త పంథాలో నడుచుచున్నట్లు కనబడుచున్నదని కొందరి వాదనయై యున్నది. కాని ఆ వాదన సరియైనది కాదు. కాలానుగుణముగా సత్యము అసత్యముగాను, అసత్యము సత్యముగాను మారునా ? కనుక క్రైస్తవ విశ్వాసమును సత్యమును విడిచిపెట్టునట్లు మారుతున్న కాలము ఎందుకు అధికారము చెలాయించవలెను? చరిత్రలో క్రైస్తవ విశ్వాస సత్యము ధృఢముగా అభివృద్ధి చెందినది. మరియు అది ఏ ఇతర చారిత్రాత్మకమైన సన్నివేశమువలె మార్పుచెందునది కాదు. దేవుని జ్ఞానము మానవులయొక్క ఉద్దేశములకు, మానవ విలువలకు అనుగుణముగా అల్లాడునది కాదు. అందుచేత దేవుని జ్ఞానమును ఎప్పుడైతే నిరాకరింతురో వారు అవశ్యముగా మానవ జ్ఞానమునకు అప్పగింపబడుదురు. మానవజ్ఞానము దేవుని నుండి వేరుచేయుచున్నది.

పౌలు ఈలాగు వ్రాయుచున్నాడు. "మరియు వారు దేవుని నెరిగియు ఆయనను దేవునిగా మహిమపరచలేదు, కృతజ్ఞతాస్తుతులు చెల్లింపనులేదు గాని తమ వాదముల యందు వ్యర్థులైరి. వారి అవివేక హృదయము అంధకారమయ మాయెను. తాము జ్ఞానులమని చెప్పుకొనును బుద్ధిహీనులైరి" (రోమా 1:21, 22). ఈ కారణము చేతనే మానవునియొక్క నిరర్థకమైన యోచనలకు ఎరగా కాకుడి అని అపొస్తలుడైన పౌలు క్రైస్తవులకు ఆజ్ఞాపించుచున్నాడు. "ఆయనను అనుసరింపక మనుష్యుల పారంపర్యాచారమును అనగా ఈ లోక

సంబంధమైన మూల పాఠములను అనుసరించి మోసకరమైన నిరర్థక తత్వజ్ఞానముచేత మిమ్మును చెరపట్టుకొని పోవువాడెవడైనా ఉండు నేమో యని జాగ్రత్తగా ఉండుడి" (కొలస్స 2:8). "నీకు అప్పగింప బడిన దానిని కాపాడి అపవిత్రమైన వట్టి మాటలకును, జ్ఞానము అని అబద్ధముగా చెప్పబడిన విపరీత వాదములకును దూరముగా ఉండుము" (1 తిమోతి 6:20).

—హాలీస్ మిల్లర్, **(VOT).**

— o —

## క్రీస్తు ఎందుకు తన రక్తమును చిందించెను ?

రక్తము చిందింపకుండ పాపక్షమాపణ కలుగదు అని లేఖనములు చెప్పుచున్నవి (హెబ్రీ 9:22). దేదీప్యమానమైన ఈ వర్తమానము పాపములు క్షమింప బడవలెనంటె రక్తము చిందించుట యొక్క అవసరతను తెలియపరచుచున్నది. ఆదికాండములో ఆదాము హవ్వలు సాతాను మాట విని, దేవుని ఆజ్ఞ మీరి తినవద్దన్న వృక్ష ఫలములు తిని దేవుని ఆజ్ఞను మీరి పాపములో పడిరి. "పాపము వలన వచ్చు జీతము మరణము" (1 యోహాను 3:4, రోమా 6:23). పాపమువలన చావవలసిన ఆదాము హవ్వలకు దేవుడైన యెహోవా చర్మపు చొక్కాయిలను చేయించి వారికి తొడిగించెను. అనగా వారి కొరకు జంతుబలి చేసినట్లు చూడగలము (ఆది 3:21).

హేబెలు కూడ తన మందలో తొలిచూలున పుట్టిన వాటిలో క్రొవ్విన వాటిని కొన్ని తెచ్చెను. యెహోవా హేబెలును అతని అర్పణను లక్ష్యపెట్టెను (ఆది కా. 4:4-5). విశ్వాసమునుబట్టి హేబెలు కయీనుకంటె శ్రేష్టమైన బలి దేవునికి అర్పించెను. దేవుడతని అర్పణను గూర్చి సాక్ష్యమిచ్చినపుడు అతడు విశ్వాసమును బట్టి నీతిమంతుడని సాక్ష్యము పొందెను (హెబ్రీ 11:4). దేవునికి అర్పణలు

అర్పించునపుడు రక్తమును చిందించుటను గూర్చి చెప్పబడినది. హేబెలు దేవునికి అంగీకారమగు బలిని అనగా గొర్రెపిల్ల రక్తమును చిందించి దేవునికి ఇష్టమైన బలి నర్పించెను. అప్పటినుండి పితరుల యుగములో యెహోవాకు బలిపీఠము కట్టి జంతుబలు లర్పించేవారు (ఆది.కా. 8:20-21, ఆది 22:13).

నిర్గమ కాండము 12:1-20 వచనములలో పస్కా బలినిగూర్చి దేవుడు చెప్పినది: "మీరున్న యిండ్లమీద ఆ రక్తము మీకు గురుతుగా ఉండును. నేను ఆ రక్తమును చూచి మిమ్మును నశింపజేయక దాటిపోయెదను" (నిర్గమ 12:13). అది యెహోవాకు పస్కాబలి (నిర్గమ 12:27). ఈ పస్కా బలి యేసుక్రీస్తు యొక్క సిలువ బలియాగమునకు ఎట్లు సూచనగా ఉన్నదో గమనించెదము.

1) నిర్దోషమైన యేడాది మగపిల్లను తీసికొనవలెను (నిర్గమ 12:6). క్రీస్తు గొర్రెపిల్లవంటి నిర్దోషమైనవాడు (1 పేతురు 1:19).

2) సాయంకాలమందు దానిని చంపవలెను (నిర్గమ 12:7). అలాగే క్రీస్తు చంపబడెను (మత్తయి 27:45-50).

3) పస్కా పశువు రక్తముద్వారా ఇశ్రాయేలీయులకు విమోచనము కలిగెను (నిర్గమ 12:13). అట్లే క్రీస్తుద్వారా మనము విమోచింపబడితిమి (1 పేతురు 1:19).

4) పస్కా బలిపశువు ఎముకలు విరువబడకూడదు. "దానిలో ఒక్క ఎముకనైనను మీరు విరువకూడదు" (నిర్గమ 12 : 46). ఆయన యెముకలలో ఒకటైనను విరువబడదు అని క్రీస్తుని గూర్చి చెప్పబడెను (యోహాను 19:36).

5) పస్కా ఆచరించుటలో - పొంగని రొట్టెలను తినవలెను (నిర్గ 12:18-20). "క్రీస్తు అను మన పస్కా పశువు వధింపబడెను గనుక పాతదైన పులిపిండితోనైనను దుర్మార్గతయు, దుష్టత్వమను

పులిపిండితోనైనను కాకుండా నిష్కాపట్యమును, సత్యమునను పులియని రొట్టెతో పండుగ ఆచరింతము" (1 కొరింథీ 5:7-8).

ఆదికాండములో ఏదేను తోటనుండి కల్వరిగిరి కొండపై సిలువ మ్రానుపై క్రీస్తు యేసు మానవ పాపప్రాయశ్చిత్త బలిగా తన ప్రాణము నర్పించి, తన రక్తమంతా కార్చిన సమయము వరకు బైబిలు అంతటిలోను దేవునితో సమాధానపడుటకు రక్తముయొక్క ఆవశ్యకతనుగూర్చి చూడగలము. పాతనిబంధన కాలములో-పాపము చేసిన మానవుడు దేవునియొక్క క్షమాపణ కొరకు-దేవుని సమీపించుటకు, దేవునితో సమాధానపడుటకు తన పాపక్షమాపణ నిమిత్తము ఒక జంతువును బలిగా అర్పించి దాని రక్తముద్వారా పాప క్షమాపణ పొందు ఏర్పాటును దేవుడు ఏర్పాటు చేసెను.

లేవీకాండము 1 నుండి 16 అధ్యాయములలో ఈ ఏర్పాటును గూర్చి మనము చూడగలము. "రక్తము దేహమునకు ప్రాణము. మీ నిమిత్తము ప్రాయశ్చిత్తము చేయునట్లు బలిపీఠముమీద పోయుటకై దానిని మీకిచ్చితిని. రక్తము దానిలోనున్న ప్రాణమును బట్టి ప్రాయశ్చిత్తము చేయును" (లేవీకా. 17:11). రక్తములో ప్రాణమున్నది. ప్రాణము దేవుడిచ్చిన వరము. దేవునికొరకు ప్రాణము ఇవ్వాలంటే బలి అర్పించాలి. రక్తము ఇవ్వాలంటే ప్రాణమునర్పించాలి. పాతనిబంధనలో అర్పించబడిన ఈ బలులు, ఒక పాపికి బదులుగా అర్పించబడెను. నిజమైన పాపక్షమాపణ ఇందు లేదు. ఏలయనగా "ఎడ్లయొక్కయు, మేకలయొక్కయు రక్తము పాపములను తీసివేయుట అసాధ్యము" (హెబ్రీ 10 : 4). క్రొత్తనిబంధనలో క్రీస్తుయొక్క పాప ప్రాయశ్చిత్త బలి నిజమైనది. "ఇదిగో లోక పాపములు మోసికొని పోవు దేవుని గొఱ్ఱెపిల్ల" (యోహాను 1 : 29).

అమూల్యమైన రక్తముచేత అనగా నిర్దోషమును నిష్కళంకము నగు గొర్రెపిల్లవంటి క్రీస్తు రక్తముచేత విమోచింపబడితిరని మీరు ఎరుగుదురుగదా (1 పేతురు 1:19, 3:18, అపొ. కార్యములు 2:22-24). "ఇది నా రక్తము అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకులకొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము" (మత్తయి 26:28). ఇదిగో నేను ఇశ్రాయేలువారితోను యూదావారితోను క్రొత్తనిబంధన చేయు దినములు వచ్చుచున్నవి (యిర్మియా 31:31)

మేకలయొక్కయు కోడెలయొక్కయు రక్తముతో కాక, తన స్వరక్తముతో ఒక్కసారే క్రీస్తు పరిశుద్ధ స్థలములో ప్రవేశించెను (హెబ్రీ 9:12-14), క్రీస్తు రక్తము నిర్జీవ క్రియలను విడిచి జీవముగల దేవుని సేవించుటకు మీ మనస్సాక్షిని ఎంతో యెక్కువగా శుద్ధిచేయును (హెబ్రీ 9:14).

"ఆయన సమస్తమైన దుర్నీతినుండి మనలను విమోచించి, సత్ క్రియలయందు ఆసక్తిగల ప్రజలను తన కొరకు పవిత్రపరచుకొని తన సొత్తుగా చేసికొనుటకు తన్నుతానే మనకొరకు అర్పించుకొనెను" (తీతు 2:14). మనము పాపము విషయమై చనిపోయి నీతి విషయమై జీవించునట్లు ఆయన తానే తన శరీరమందు మన పాపములను మ్రానుమీద మోసికొనెను. ఆయన పొందిన గాయములచేత మీరు స్వస్థత నొందితిరి (1 పేతురు 2:24). "ఏలయనగా పాపము వలన వచ్చు జీతము మరణము, అయితే దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తు యేసునందు నిత్యజీవము" (రోమా 6:23, యోహాను 3 : 16).

—పి. ప్రకాశం, జగన్నాథగిరి.

— o —

# బైబిలును అర్థము చేసుకొనుటకు పది సూత్రములు

**(Ten Simple Reasons to Understand the Bible)**

—చార్లెస్ స్కాట్.

ప్రపంచ గ్రంథము లన్నిటిలోను గొప్ప గ్రంథముగా నేటికిని బైబిలు ఉన్నది. మనము 21వ శతాబ్దమునకు సన్నిహితముగా యున్నాము. అయినను బైబిలు గొప్ప గ్రంథముగాను, పెక్కుమందిచే చదువబడుచున్న గ్రంథముగాను నేటికిని తన స్థానమును కోల్పోవకుండ యున్నది. ప్రతి సంవత్సరము ఇంచుమించు 4 కోట్ల బైబిళ్లు ముద్రించబడుచున్నవి. ఈ ముద్రిణ కార్యక్రమములో 1,58,000 మంది అనుదినము ప్రపంచమందంతటా పని చేయుచున్నారు. ఆధునిక మానవునికి అత్యవసరమైన గ్రంథము బైబిలు.

బైబిలును అంతమంది ఎందుకు ప్రేమించుచు చదువుచున్నారు? వేలయనగా తననుగూర్చి బైబిలు ఏమని చెప్పుకొనుచున్నదో అది వాస్తవమని వారెరుగుదురు: మానవులకు దేవుడిచ్చిన వర్తమానము అది. అపొస్తలులు, ప్రవక్తలద్వారా దేవుడు బైబిలునందలి 66 పుస్తకములను పరిశుద్ధాత్మని బయల్పాటువలన లిఖించి యిచ్చెను. అది దైవ ప్రేరణచే వ్రాయబడెను. II తిమోతి 3:16, 17; యోహాను 14:26; యోహాను 16:13; ఎఫెసీ 3:4-5 లను దయచేసి చదువండి.

బైబిలు దేవునినుండి కలిగినదని అనేక సంగతులు నిరూపించుచున్నవి : కొందరు పురాతత్వ శాస్త్రజ్ఞులు మొదట వారు నాస్తికులైనను, వారు త్రవ్వి కనుగొనిన సత్యములను బట్టి బైబిలు చారిత్రాత్మకముగను, భౌగోళికముగను యదార్థమని గ్రహించి విశ్వాసులుగా మార్చబడిరి. గొప్ప విజ్ఞానశాస్త్ర సంబంధమైన సత్యములు బైబిలునందుండుటచే అది దైవప్రేరిత గ్రంథమని విశదమగు

చున్నది. అందరు భూమి బల్లపరుపుగా నుండెనని నమ్ముతుంటే, దాని లేఖకులు అది గుండ్రముగా నుండెనని వ్రాసిరి (యెషయా 40:22). భూమి దేనిపై ఆధారపడి యున్నదో యని శాస్త్రవేత్తలు తర్కించుకొనుచుండగా, "దేవుడు శూన్యముపై భూమిని వ్రేలాడ జేసెనని" అది చెప్పుచున్నది (యోబు 26:7). 40 మంది లేఖకులు 1600 సంవత్సరముల కాలములో దాన్ని వ్రాసినను దానిలోని ఏక త్వమును బట్టి అది మానవుని మేధస్సు వలన కాదుగాని దేవునినుండి కలిగినదని నిరూపణ యగుచున్నది.

మనము బైబిలును అర్థము చేసికోగలము, అర్థము చేసుకోవాలి: మన హృదయం నిష్కపటమైనదయితే దాని ప్రాథమిక బోధలను సునాయాసంగా అర్థము చేసికోగలము. దాన్ని అర్థము చేసికోడానికి మనము తప్పక ప్రయత్నించాలి. గనుక ఆనందభరిత మైన సమృద్ధి జీవితమును ఇప్పుడే మనం ఆరంభింపవచ్చును. దేవుని చిత్తమును జరిగించుచున్నామని తెలిసికొనుటలోను, పరలోకము మనదగునని ఎరుగుటలోను మనకు గొప్ప ఆనందము కలుగును. గనుక బైబిలును అర్థము చేసికొనుటకు 10 సూత్ర్మ సూత్రములను ఈ పత్రిక ద్వారా మీకు అందించుచున్నాను.

**1. దానిని అర్థముచేసికొను కోరికతో పఠించుము:** మనం అర్థము చేసుకొనుటకే దేవుడు బైబిలు నిచ్చాడు. "మీరు అవి వేకులు కాక ప్రభువు చిత్తమేమిటో గ్రహించుకొనుడి" యని ఎఫెసీ 5:17 చెప్పుచున్నది. బెరయలోని ప్రజలు ప్రతి దినము లేఖనములను పరిశోధించుచువచ్చిరి గనుక వారు ఘనులని చెప్పబడినది (అపొ.కా. 17:11). యితరులైతే "యెల్లప్పుడు నేర్చుకొనుచున్నను సత్యము విషయమైన అనుభవజ్ఞానము ఎప్పుడు పొందలేని" బుద్ధిహీనులని చెప్ప బడినది (2 తిమో 3:6, 7).

దేవుని యెడల ప్రేమ, ఆయన వాక్యమును గ్రహించుకోవాలనే కోరిక యున్నప్పుడు బైబిలును మనం అర్థము చేసికోగలము. "నీతికొరకు ఆకలిదప్పులు గలవారు ధన్యులు. వారు తృప్తిపరచ బడుదురు" అని యేసుప్రభువు చెప్పెను (మత్తయి 5 : 6). మనం దేనికొరకైనా ఆకలిదప్పులు కలిగియుంటే ఆ కోరికను తీర్చుకొనుటకు ప్రయత్నింతుము. "ఎవడైనను ఆయన చిత్తముచొప్పున చేయ నిశ్చయించుకొనిన యెడల ఆ బోధ దేవుని వలన కలిగినదో, లేక నా యంతట నేనే బోధించుచున్నానో వాడు తెలిసికొనును" అని యేసు చెప్పెను (యోహాను 7 : 17). దేవుని చిత్తము చొప్పున చేయ నిశ్చయించుకొంటే అది అర్థమగునను సంగతి గ్రహించుము. గనుక బైబిలును చదువునపుడెల్ల, దేవుని చిత్తాన్ని తెలిసికొని దాన్ని జరిగించగోరుచున్నానా? యని మనలను మనం ప్రశ్నించుకోవాలి. మనం నిజంగా ఆకలిదప్పులు కలిగియుంటే తృప్తిపరచబడుదుము. [సశేషం]

---

[బైబిలు 2వ పేజీ తరువాయి]

ఏప్రియల్ 25వ తేదీ మంగళవారం తూర్పు గోదావరి జిల్లా శంఖవరం గ్రామంలో సువార్తికుల సదస్సు (Preachers Work-shop) జరిగెను. పలు ప్రాంతములనుండి వచ్చిన అనేకమంది సువార్తికులు, స్థానికులు మొత్తం 300 మంది పాల్గొని సదస్సును జయప్రదం గావించిరి. సదస్సు నూతనంగా రూపు దిద్దుకొని పునర్నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయములో జరిగెను. "దేవుడున్నాడా? అయితే ఆయన బైబిలు బయలుపరచు దేవుడా?" యను అంశమును సహోదరులు పెక్కు మంది కూలంకషంగా చర్చించిరి. అనేకులు ఆనందోత్సాహములతో పాల్గొని సభను ఉత్తేజపరచిరి. సాయంత్రం సదస్సు అనంతరం 8 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

సోదరులు N ఏలియా, పి. సామ్యేల్, V. చిన్నయ్య గార్లు ప్రార్థనలు నిర్వహించిరి. సో॥ వి. హిట్లర్, పి. హెన్రీ, బి. యోహాను, పి. చంద్రశేఖర్, డి. రంగారావ్, బి. కొండలరావ్, ప్రసాదరావ్,

పి. ఫిలేమోను, జి. షడ్రక్, పాల్ గూటం, చుక్కా అప్పారావ్, నొక్కు రాజు, ఇ. ప్రభాకర్ గార్లు చర్చిలో పాల్గొని చక్కటి సందేశముల నిచ్చిరి. ఎండలు తీవ్రముగా యున్నను స్థానిక సంఘము చక్కటి భోజన పానాదుల నేర్పరచి దూర ప్రాంతములనుండి వచ్చిన సువార్తికులకు ఆతిథ్యమిచ్చిరి. సంఘ కార్యక్రమములను నిర్వహించుచున్న బి. డేవిడ్ రాజుగారు, వారి కుమారుడు డేవిడ్ సాల్మన్ రవికుమార్ గారు సల్పిన నిర్విరామ కృషి వలన సమస్తము సక్రమముగాను మర్యాదకరంగాను జరిగెను. వీరిరువురిద్వారా శంఖవరం మండలంలో బలమైన క్రీస్తు పని జరుగుచున్నది.

ఏప్రియల్ 27, 28, 29, 30 తేదీలలో నిజామాబాద్‌లో జరుగు సువార్త సభలలో వాక్యపరిచర్య చేయుటకు సోదరులు పాల్ గూటం, N. ఏలియా, జాషువా గూటం, వారి కుమారులు రిక్కీ, రాబిన్‌లు ఈ పత్రిక ముద్రించుసరికి బయలుదేరి వెళ్లిరి. మే నెల సువార్తికుల సదస్సు 22వ తేదీ సోమవారం ప్రూజారిపాలెంలో వి. హిట్లర్ గారి ఆధ్వర్యమున జరుగును.

★

Regd. No. H/KD—45/KD H.O
Date of Posting : 15th of Every month

From
SATYA VAKKU
P.O. Box 80
KAKINADA 533 001

No

To